# తారురోడ్డు

శ్రీ నేతి కామేశ్వర శాస్త్రి.

"అబ్బాయీ! పిల్లలు దెబ్బలాడుతున్నాయి కాబోలు చూడు వీటి మొహం తగలయ్యా. ఓమాటు కొట్టిరా చంటిపిల్లాడు ఏడ్చేడ్చి పడుకొన్నాడు."

"కాదే! అమ్మా! నాన్న గుర్రెడుతున్నాడే"

అబ్బా! ఏం సంతొచ్చిందమ్మా! ఆ దిక్కుమాలిన పొడుం మానమంటే మానరు కదా! పిల్లాడు ఒక్కమాటే నా నిద్దరపోడు యీగోల మూలాన్ని."

"ఓరి వీటి తస్సాదీయ ఏమిటోకాని తెగకుడుతున్నాయి వెధవచాప, రోడ్డుమీద పారేయ్. బిసేవ్! పట్టి మంచంమీద పక్కేశావా?"

"ఆ! వేశాను పడుకోండి"

"అన్నిదార్లోనే తగవేస్తారు ఎక్కడా చోటు లేనట్టు, వెధవపాండ్ర పీనుగులు."

"అదేమిటండే దిక్కుమాలిన పనులు అన్నీయిల్లాంటి పనులే వెళ్లివెళ్ళి పచ్చడిరాచ్చిప్ప తన్నేరేమిటి!"

"దార్లో పెట్టుమని ఎవరేడిశారు."

"ఇంట్లోకెళ్ళి పడుకోమంటే వంటింట్లో కెందుకు ఆడంగబ్బన్నలాగ అస్తమాను కుండల్లో గుర్రాలు తోలుతూ ఉంటారు.

"బాగానే ఉంది దిక్కుమాలిన విసుక్కోవడం పెందరాళే పక్కెయ్యమంటే వెయ్యకూడదూ నిద్రకళ్లు తెలీలేదు. ఎక్కడ చావమన్నావు ముసిలిముండావాణ్ణి."

"(మంచంమీద పడుకొని) ఓరి వీటి మొహం తగలయ్యా! ఏం కుడుతున్నాయే!"

"పడుకుందురూ అస్తమానూ ఏవో కుడుతూనే ఉంటాయి, మీకు"

"అయ్య బాబోయ్! దీపంయిల్లా పట్రావే దిక్కుమాలినదానా? ఎల్లావీకిందో చూడవే చెవంతా రక్తమే. ఖండచీమలు కూడా వచ్చేయేం ప్రారబ్ధమే? ఒక్క సారేనా ఎండలో తగవెయ్యమంటే తగవెయ్యవు కదా? మంచం అడ్డిడు తినడం అంట తప్పేలాలుతో మడంతప్ప ఏవల్ల కాదూలేదు. ఎప్పుడో ఓ రోజుని తిండెట్టకుండా వీధులోకి తరుముతే సరి రోగం కుదురుతుంది."

"అబ్బ! ఈవేళేకాదూ! చంటిపిల్లలదగ్గిరనుంచీ ఎండలో పారేశాను. అంతకన్నా ఎక్కడచావనూ! ఏ మవుతుందీ అస్తమానూ పొడుం పీలుస్తాంటేను"

"ఏడిసినట్టే ఉంది. చస్తాంటే సంధిమంత్రం. ఇప్పుడూ వేళాకోళం. చూడలే! కుర్రవెధవ పీనుగులు మిఠాయితిని మంచంమీద పోశేరేమో! లేకపోతే నువ్వే పోశావో!"

"అయ్యో! నా మొహం తగలయ్యా! చాల్లెండి ఇన్నేళ్ళూ ముడ్డికిందకొచ్చి మంచంమీద కూర్చుని తినడం కూడాను. అదికాకుండా మీరు నాకు డబ్బు కూడా యిచ్చేరు."

"అయ్యొయ్యో! ఇదేం కర్మమే ఒళ్లంతా పుట్టలకొద్దీ పోశేశాయి దిక్కుమాలిన చీమలు. ఇల్లాచూడు అన్నీ దద్దుర్లే ఎల్లాగా బతకడం ఒక మాటుదీపం ఇలా చూపించలే! నీ యిల్లువల్ల కాదు గాను."

"నారాయణ. ఇదేమిటండీ పాదాలనిండా అన్నీ చీమలే! కాలినిండా నల్లగా వుందేమిటే! కొంప తీసి ఏదేనా తొక్కరా లేదు కదా! బట్టలన్నీ తడిపి తగలెయ్యాలి."

"నీ మొహం లాగే ఉంది. ఎక్కడ చచ్చేను. ఏం తొక్కొచ్చాను. ఇప్పుడే కాదూ ఓమాటు రోడ్డుమీద కెళ్లాను."

"సారి, ఇంకనేం అల్లాయిదీ ఏదో తొక్కొచ్చారు, పక్కంతా రాశేశారు. కాళ్లేనా ఓ సారి కడుక్కో కూడదూ? అదేమిటో బెల్లం వాసనేస్తూంది కూడాను కాలినిండా బెల్లం ఎల్లా వచ్చిందమ్మా! యీ మనిషికి. ఇదేం విడ్డూరమో కాని."

"అద్దీ కోనేవ్! జ్ఞాపకం వచ్చింది. ఆ వీధిని తారు రోడ్డు వేస్తున్నారే! అది తొక్కొచ్చాను, ఆరి దీని తస్సాదీయ చూశావా? ఎంత పనిచేశిందో తారురోడ్డు."

"అవును లెండి తారురోడ్డు తొక్కితే బెల్లం వాసనేమిటి. మీకేమన్నా మతుందా లేదా?"

"అది కాదే: బెల్లం చవగ్గా ఉంది కదా; పేరు మాత్రం తారురోడ్డు అనడం, అంతా బెల్లప్పాకమే కాదూ! తారెక్కడేడిసింది దాల్లో. ఏదో నీనత్తి నానత్తి బద్దలకొట్టడం మునిసిపాలిటీవారు యిల్లాంటి కక్కుర్తి పనులుచేస్తూ ఉండడం, మధ్యన కంట్రాక్టర్ల పని బాగుంది మేడలు మిద్దెలువేచి పోతున్నాయి. మన కేనా వచ్చిందికాదూ; అల్లాంటి ఉద్యోగం ఎంచక్కాను.